
# గుండె చప్పుడు

**- పి.యస్.వి.ప్రసాద్**




ఆకాశంనిండానల్లని మబ్బులు. పైన చిన్న తుంపర్లు, దానికి తోడు గాలి. వాన పెద్దదయ్యేలా ఉంది. అయినా తప్పదు ఆరుగంటలకల్లా ప్రేమ సమాజంలో ఉండాలి పరంధామయ్య.

మొన్ననే ఆరు పదులు నిండాయి ఆయనకు. ఉద్యోగ విరమణ చేసి రెండేళ్ళు పూర్తయింది. ఆస్తిపాస్తులు పెద్దగా లేకపోయినా ఎన్నడూ అప్పుచేసి ఎరుగడు. ఇద్దరు కొడుకులు ఒక కూతురు. ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయి ఎవరి మట్టుకు వారు స్థిరపడ్డారు. ఇంట్లో ఆయన, ఆయన భార్య - ఇద్దరే. ఏ చీకూ చింతా లేకుండా జీవితం హాయిగా సాగిపోతోంది వాళ్ళకు.

పరంధామయ్య గొప్ప వక్త కావడంతో నగరంలో ఎక్కడ ఏ సభలు సమావేశాలు జరిగినా వీరికి ఆహ్వానం అందడం, వీరు వెళ్ళి ప్రసంగాలివ్వడం ఓ ప్రహసనంలా సాగిపోతోంది. అలా ప్రసంగాలివ్వడం, ప్రశంసలు పొందడం ఈయనకు మహా ఇష్టం.

అలా వచ్చిన ఆహ్వానం మేరకే పరంధామయ్య తను చెప్పబోయే ప్రసంగం "భ్రూణహత్యలు, అనాధబాలలు," అన్న అంశం పై అంచెలంచెలుగా ఆలోచనలు, ఆ ఆలోచనల అలలలో సడన్ బ్రేక్ వేశాడు

"ఏంటి ఈ కోతి మూక ఎందుకిలా అడ్డుపడింది!"

ఇంచుమించు ఐదారు కోతులు అనుకోకుండా కాదు. కావాలనే అడ్డు పడ్డాయి. ఒకటి ఒంటి కాళ్ళ మీద నించొని నాట్యం చేస్తోంది. రెండవది రెండు చేతులతో నమస్కరిస్తుంది. మూడవది సలాం చేస్తుంది. ఇంకొకటి దీనంగా చూస్తుంది. మరొకటి దారి మళ్ళించింది. వాటిని చూస్తూ మంత్ర ముగ్ధుడైన పరంధామయ్య స్కూటర్ దిగకుండా నెమ్మదిగా వాటి వెనక వెళ్ళాడు.

మబ్బులు దట్టంగా కమ్ముకోవడం వలన ఆ ప్రాంతం అంతా చీకటి ఆవరించింది. మునిసిపాలిటీ దీపం మాత్రం మినుకు మినుకుమంటోంది. వీస్తున్న గాలితోపాటుగా

# అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం ప్రారంభోత్సవం ఒక "చారిత్రక సంఘటన"

మొన్నటి 'సంఘటన' నిన్నటి వార్త. అదే నేటి చరిత్ర. అయితే ప్రతినిత్యం జరిగే సంఘటనలన్నీ చరిత్రలు కావు. వాటిలో కొన్ని మాత్రమే చరిత్రలుగా మిగిలిపోతాయి. ఆయా సంఘటనల వెనుకగల ఆశయాలు, లక్ష్యాలు వాటి ఆచరణ యోగ్యతా, సాధ్యాసాధ్యాలు, అనుస రణీయతా, దీర్ఘకాలిక ప్రయోజనాలు, భవిష్యత్తులో వాటి ఆవశ్యకత, వర్తమానంలో వాటికోసం పౌరులు పాటుపడవలసిన తీరు, బాధ్యత ఇత్యాది అనేక అంశాలు 'చరిత్ర'కు మూలకాలు అవుతాయి. ఇంతటి పునాది కల్గిన 'సంఘటన' మాత్రమే 'చారిత్రక సంఘటన్'గా పదికాలాలపాటు 'చరిత్ర పుటలలో' నిలుస్తుంది. చెన్నయ్, మైలాపూరు లజ్‌కార్నర్‌లో 2001 నవంబర్ 28న జరిగిన 'అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనం' ప్రారంభోత్సవం నూటికి నూరుపాళ్ళు గొప్ప 'చరిత్రాత్మక సంఘటన' అని చెప్పవచ్చు.

ఉమ్మడిరాష్ట్రం (ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, రెండూ ఒకే పేరుతో ఉభయులకూ చెన్నై రాష్ట్రం)గా ఉన్నప్పుడు, త్యాగధనుడు పొట్టిశ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర(భాషా ప్రయుక్త) రాష్ట్రసాధనకై, రాజధాని మద్రాసులో దీక్ష చేపట్టారు. శ్రీరాములు దీక్షబూని, తుదిశ్వాస విడిచిన గృహాన్ని (బులుసు సాంబమూర్తిగారి అద్దె ఇంటిని) ఒక అధునాతన చిరుసౌధంగా తీర్చిదిద్దడం, ఆ నూతన భవన ప్రారంభోత్సవం, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు రెండింటికీ గవర్నరుగా వున్న డా॥ శ్రీ సి. రంగరాజన్ చేతుల మీదుగా జరగటం ఒక మహా 'చారిత్రాత్మక సంఘటన'. ఈ కార్యక్రమంలో శ్రీరంగరాజన్‌తో పాటు, ఆయన సతీమణి డా॥ హరిప్రియారంగరాజన్, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు శ్రీ కె.విజయరామారావులు పాల్గొన్నారు. భవన ప్రారంభోత్సవానంతరం రంగరాజన్ మాట్లాడుతూ "పొట్టిశ్రీరాములు ఆంధ్రరాష్ట్ర సాధనలో తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణ త్యాగం చేసిన అసలు సిసలైన 'త్యాగి'గా అభివర్ణించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ, దేశంలో మిగతా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి దారి తీసిందన్నారు."

శ్రీ వై. యస్.శాస్త్రి, శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు సంయుక్తంగా రచించిన 'అమరజీవి సమరగాథ' గ్రంథాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించిన శ్రీ విజయరామారావు మాట్లాడుతూ అమరజీవి అంకితభావం, అకుంఠిత దీక్ష, త్యాగశీలతలకు 'సజీవ చిహ్నం'గా ఈ నూతన స్మారక భవనం నిలుస్తుందన్నారు. స్మారక భవనంలో పెద్ద గ్రంథాలయం కూడా చోటు చేసుకోవడం విశేషం. ఎందరికో స్ఫూర్తిదాయకమైన ఈ స్మారక మందిరాన్ని ప్రతి తెలుగువాడూ దర్శించి తీరాల్సిందే.

- ఒ.వి

అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ డా॥ శ్రీరంగరాజన్ దంపతులు, ఆంధ్రప్రదేశ్ అమాత్యులు శ్రీ.కె.విజయ రామారావు తదితరులు.



---

వస్తున్న దుర్గంధపూరిత వాసనకు తట్టుకోలేక ఒక చేత్తో రుమాలు తీసి ముక్కుకు అడ్డం పెట్టుకున్నాడు. చిన్న ఏడుపు వినిపించింది. కాదు చిన్న పిల్లాడి ఏడుపు!? చెత్త కుప్ప ప్రక్కన ఓ పసికందు, చుట్టూ దీనంగా చూస్తూ ప్రార్థిస్తున్నట్లుగా మరో మూడు కోతులు హృదయ విదారకమైన దృశ్యం.

వర్షం ఊపందుకుంది. పూర్తి రైన్ కోట్‌లో ఉన్న పరంధామయ్య మాత్రం ఫుల్‌సేఫ్. గాలికి మునిసిపాలిటీ లైటు కూడా ఆరిపోయింది. అయినా పరంధామయ్యకు స్కూటర్ హెడ్‌లైటు ఉంది. కాని మనసు మూగబోయింది. ఒకింత సానుభూతిని మాత్రం విదిల్చి స్కూటర్‌ను మరలా తన దారికి త్రిప్పుకున్నాడు. అడ్డం వచ్చిన కోతిమూకను తప్పించుకుని మరీ వచ్చేశాడు ప్రేమ సమాజానికి.

కార్యకర్తలు సాదరంగానే ఆహ్వానించారు. సభ ప్రారంభమయింది. ముఖ్య వక్తగా అతని వంతు వచ్చింది. ప్రసంగం ప్రారంభించాడు. ఆస్తికత్వం, అండపిండ బ్రహ్మాండాలు, అనాధ బాలలు, శ్రీకృష్ణ జన్మరహస్యం, మానవతావాదం, భ్రూణహత్యలు, డార్విన్ సిద్ధాంతం ఇలా ఒకటేమిటి, ఏకధాటిగా ఒక గంటసేపు ఆద్యంతం అత్యద్భుతంగా ప్రసంగించేసరికి ప్రజలు తన్మయంతో ఏకధాటిగా కరతాళధ్వనులతో ప్రశంసల వర్షం కురిపించారు.

ఇదంతా అతనికి అలవాటే. సాధారణంగా సత్కారాలకు, పురస్కారాలకు పరవశించి గంటల తరబడి సభల్లోను, సమావేశాల్లోను గడపటం ఆయనకు పరిపాటే. సభానంతరం కూడా అనేక విషయాలు ముచ్చటిస్తూ సమయాన్ని మరచిపోవటం కూడా రివాజే.

కాని ఆ రోజెందుకో వెంటనే బయల్దేరేసరికి "ఏవండి ఏమైనా పనుందా?" అన్న ఓ కార్యకర్త ప్రశ్నకు అవునన్నట్లుగా తలవూపుతూ అంతలోనే స్కూటర్ స్టార్ట్ చేశాడు.

వాన వెలసిందేమో నిర్మానుష్యంగా ఉంది ఆ రోడ్డు. అదే రోడ్డులో మరలా సడన్ బ్రేక్ పడింది. ఈసారి ఏ కోతిమూకా లేదు. అయినా బండి ఆగిందేం చెప్మా అనుకుంటూ అదే సందుగుండా మరలా మలుపు తిప్పాడు.

ఈసారి ఆ చెత్తకుప్ప దగ్గర ఏ కోతులూ లేవు. కాని కొన్ని కుక్కలు ఓ మాంసపు ముద్దను పీక్కు తింటున్న దృశ్యం ప్రత్యక్షమయింది. కరంటు షాక్ కొట్టినట్టు, పెద్ద పిడుగు పడినట్టు గుండె ఆగినట్టు అయ్యింది. 'ఏమున్నది గర్వకారణం' అంటూ ఎవరో వెక్కిరించినట్టయ్యింది. అప్పటిదాకా ఆరివున్న మునిసిపాలిటీ దీపం సడన్‌గా వెలిగింది. కాని అప్పటికే అంతా అయిపోయింది.